క్లుప్తంగా

అప్పాపురంలో జీపీఎస్ సర్వే



జీపీఎస్ సర్వే చేస్తున్న దృశ్యం

లావేరు: సమగ్ర భూముల సర్వేతో రైతులకు మేలు జరుగుతోందని అప్పాపురం పంచాయతీ సర్పంచ్ జగ్గరోతు నాగరత్నం అన్నారు. అప్పాపురం గ్రామంలో సమగ్ర భూముల సర్వేలో భాగంగా జీపీఎస్ సర్వేను శుక్రవారం చేపట్టారు. జీపీఎస్ టీమ్ సభ్యులు, సర్వేయర్లు ఇందులో పాల్గొన్నారు. సర్వేకు రైతులు సహకరించాలని సర్పంచ్ సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జగ్గరోతు సత్యనారాయణ, వలంటీరు గౌరునాయుడు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వస్తువుల వితరణ



వస్తువులు అందజేస్తున్న దృశ్యం

రణస్థలం: మండల కేంద్రంలోని గరికిపాలెం అంగన్‌వాడీ కేంద్రానికి విజయనగరం జిల్లా సాలూరు గ్రామానికి చెందిన చల్లా దంతేశ్వరరావు పలకలు, ఫ్యాన్‌లు, గ్లాసులు, గిన్నెలు, ఆట వస్తువులు అందజేశారు. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న అతను తన స్నేహితుడు రవికుమార్ ద్వారా వీటిని అందించారు. ఎన్‌ఆర్‌ఐ దంతేశ్వరరావుకు అంగన్‌వాడీ సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రణస్థలం సీడీపీవో ఝాన్సీభాయ్, సూపర్‌వైజర్ మంగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త రూపసుధ ఉన్నారు.

9 నుంచి విజయదుర్గ ఆలయ వార్షికోత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నానుబాల వీధిలో వేంచేసిన విజయదుర్గ అమ్మవారి 17వ వార్షికోత్సవాలు ఈనెల 9 నుంచి 14వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. దీనిలో భాగంగా రాజశ్యామల యాగ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యాగ పూర్ణాహుతికి శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి వస్తారని తెలిపారు. భక్తులు ఈ యాగంలో పాల్గొనాలని కోరారు.

కొనసాగిన పింఛన్ల పంపిణీ



గురువమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు శ్రీనివాసరావు

లావేరు: సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ రెండోరోజైన శుక్రవారం కూడా మండల వ్యాప్తంగా కొనసాగింది. అదపాక గ్రామానికి చెందిన వితంతువు బొత్స గురువమ్మ అనారోగ్య సమస్యతో బాధపడుతూ రణస్థలం మండలం కొచ్చెర్ల గ్రామంలోని కుమార్తె ఇంటి వద్ద ఉంటుంది. దీంతో స్వగ్రామంలో పింఛన్ డబ్బులు తీసుకోవడం సాధ్యం కాకపోవడంతో వలంటీరు పిన్నింటి శ్రీనివాసరావు కొచ్చెర్ల గ్రామానికి వెళ్లి గురువమ్మకు పింఛన్ అందజేశారు.

సంతోషిమాతకు పూజలు



సంతోషిమాతకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో వేంచేసిన సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో పూజలు జరిపించారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

90 మందికి వైద్య పరీక్షలు

ఆమదాలవలస రూరల్: వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని మెడికవర్ ఆస్పత్రి వైద్యులు హరిణి, చైతన్య సూచించారు. వెదుళ్లవలస గ్రామంలో సర్పంచ్ చిలకపల్లి సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 90 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వేసవి కాలంలో వైరల్ జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు.

సంక్షేమాన్ని వివరిస్తూ..
సమస్యలు తెలుసుకుంటూ..

- పొన్నాడ సచివాలయం-2 పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించిన ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



ప్రజలకు సంక్షేమాన్ని తెలియజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్:

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు సమస్యలు ఏమైనా ఉన్నాయాని అని అడిగి తెలుసుకుంటూ ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పొన్నాడ గ్రామ సచివాలయం-2 పరిధిలోని గ్రామాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరువ చేస్తున్నామన్నారు. తెప్పరేవు, వెంకన్నగారిపేట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా ఇంటింటికీ వెళ్లి రేషన్ కార్డు వారీగా నాలుగేళ్లలో చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..అర్హులందరికీ న్యాయం చేసేలా గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు పనిచేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మళ్లీ ఆయన్నే చూడాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోని చంద్రబాబు ఎన్నికలు సమీపిస్తుండడంతో మరోసారి వారిని మోసం చేసేందుకు సిద్ధమవుతున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మొదలవలస చిరంజీవి, పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ నక్క కృష్ణమూర్తి, నాయకులు నేతింటి నీలమప్పడు, సర్పంచ్ నేతింటి యమున, ఎంపీటీసీ సభ్యులు అల్లు తులసమ్మ, పప్పల రాజేశ్వరి, నాయకులు అల్లు తులసీరావు, కునుకు కన్నప్పడు, గంగు ఎర్రన్నాయుడు, పప్పల వెంకటరమణపాల్గొన్నారు.

నేడు బంటుపల్లిలో..

రణస్థలం: బంటుపల్లి గ్రామంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మండల జగనన్న సచివాలయ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి తెలిపారు.

త్వరితగతిన భవన నిర్మాణాలు



సమీక్ష నిర్వహిస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీలో నిర్మాణంలో ఉన్న భవనాలు త్వరితగతిన పూర్తికావాలని బీఆర్‌ఏయూ వీసీ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ పాలక మండలి సమావేశ మందిరంలో శుక్రవారం కేంద్ర ప్రజాపనుల విభాగం ఇంజినీరింగ్ అధికారులు, విశ్వవిద్యాలయం అధికారులతో సమీక్ష నిర్వహించారు పరిపాలన భవనం నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. పురుషుల వసతి గృహం భవనం త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయంలో అవసరం మేరకు భవనాలు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్రప్రసాద్, శ్రీకాకుళం నగర పాలక సంస్థ ఈఈ డాక్టర్ పి.సుగుణాకరరావు, సీపీడబ్ల్యూడీ ఇంజినీరింగ్ అధికారులు వి.శ్రీనివాసరావు, ఎం.వి.రావు, కె.సి.నాయక్, ఐ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

4న పుస్తక పరిచయం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక కథా నిలయంలో చిక్కోలు బుక్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 4న 'యుద్ధమే శాంతి' పుస్తక పరిచయం కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, సాహితీ అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఉత్తమ సేవలందించారు



కిరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ, మెప్మా పీడీగా కిరణ్‌కుమార్ ఉత్తమ సేవలు అందించారని శ్రీకాకుళం జిల్లాకు కొత్తగా వచ్చిన విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కె.కవిత అన్నారు. ఏడీగా కిరణ్ 17 నెలలు పనిచేసి ఎంతో మందికి మేలు చేశారన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డేమ్మ, ఆఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిలక్ హాల్ అభివృద్ధికి విన్నపం



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూలు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు స్కూల్‌లో ఉన్న తిలక్ హాలు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిసి శుక్రవారం విన్నవించారు. భవన ప్లాన్, ఎస్టిమేట్ పత్రాలు, వినతి పత్రాన్ని ఎంపీకి అందచేశారు. తప్పక చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారని సంఘం ప్రతినిధులు తెలిపారు. దీని కోసం హెచ్‌ఎం, కమిషనర్‌తో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారని సంఘం అధ్యక్షుడు వీజీకే మూర్తి తెలిపారు. ఆయనతో పాటుగా పొలిశెట్టి మల్లిబాబు, జేఎస్ఎస్ ప్రకాశరావు, బాలమురళీకృష్ణ, కిల్లాన ఫల్గుణరావు, కేఎల్ఎన్ మూర్తి తదితరులు ఉన్నారు.

ఆలయ భూములు రక్షించాలని వినతి

నరసన్నపేట: జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని పాలకొండ రోడ్డులో ఉన్న కోదండ రామస్వామి ఆలయ భూములను రక్షించాలని, ఆ భూముల నుంచి కౌలు ఆలయానికి వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్ చెట్టు నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. నరసన్నపేట మండలం పోతయ్యవలసతో పాటు పలు గ్రామాల్లో 730 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్టు చెప్పారు. సాగు చేస్తున్న రైతులు కౌలు చెల్లించడం లేదన్నారు. ప్రస్తుతం ఆలయంలో అర్చకులు ధూపదీప నైవేద్యాలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు గమనించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలు రాకుండా క్వారీ నిర్వహించాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: గ్రానైట్ క్వారీ నిర్వహణ వల్ల గ్రామస్తులకు, భూములకు, తాగునీటికి ఎటువంటి సమస్యలు రాకూడదని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిఅన్నారు. మెళియాపుట్టి మండలం దబ్బగూడలో సర్వే నంబర్-13లో 10 హెక్టార్ల కలర్ గ్రానైట్ నిర్వహణకు సీహెచ్ శ్రీనివాసకుమార్ ప్రైవేట్ సంస్థకు సంబంధించి శుక్రవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ క్వారీనుంచి ప్రభుత్వానికి చెల్లించేదానిలో 75 శాతం చుట్టుపక్కల గ్రామాలకు ఖర్చుచేసి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందే ప్రజల అవసరాలను తీర్చడానికి ముందుకురావాలన్నారు. యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ రాళ్లను కోసే సమయంలో ఎటువంటి హానికర ద్రావణాలు వాడబోమని, బాంబు పేలుళ్లు చేయడం జరగదని, పరిమితికి మించి బరువులను తరలించబోమని చెప్పారు. అనుమతులు ఒకలా తీసుకుని, పనులు వేరేలా చేసి ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే పనులు నిలిపివేస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు మైనింగ్ శాఖ అధికారులు, తహశీల్దార్ సరోజిని, ఏఓ తిరుపతి పట్నాయక్, ఆర్ఐ వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో పండిత సదశ్యం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అంకురార్పణ, హోమం, పండిత సదశ్యం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు చేశారు. అంతకుముందు స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించారు.

మద్యం దుకాణం తరలింపు

పోలాకి: బెలమర జంక్షన్‌లో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని పిన్నింటిపేటకు అధికారులు శుక్రవారం తరలించారు. గతంలో కూడా ఇక్కడే మద్యం దుకాణం ఉండేది. అయితే శివాలయం, కోదండ రామాలయం ఉండడంతో ప్రజలు, భక్తు లు ఇబ్బందులు పడుతున్నారని వ్యాపార కేంద్రమైన పిన్నింటిపేట నుంచి జనావాసాలకు దూరంగా ఉన్న బెలమర జంక్షన్‌కు మార్చారు. మళ్లీ పిన్నింటిపేటకు తరలించడానికి కారణం తెలియరాలేదు.

గృహ నిర్మాణాలు ప్రారంభించాలి

- హౌసింగ్ డీఈ నర్సింగరావు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

హిరమండలం: ఇంటి నిర్మాణాలను త్వరితగతిన ప్రారంభించాలని గృహనిర్మాణ శాఖ డీఈ వి.నర్సింగరావు లబ్ధిదారులకు సూచించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ కాంతి పథం (వెలుగు) కార్యాలయలంలో జగనన్నకాలనీ ఇళ్ల పట్టాల లబ్ధిదారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధ్యమైనంత త్వరగా నాణ్యతా ప్రమాణాలతో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలన్నారు. మండలంలో జగనన్న లేఅవుట్లలో 409 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరవ్వగా.. ఇందులో మేజర్ పంచాయతీ హిరమండలంలోనే 247 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు. వీరంతా వారికి కేటాయించిన స్థలాల్లో ఇళ్లను నిర్మించాలన్నారు. లేఅవుట్లలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మంజూరైన ప్రతి ఇంటికి ప్రభుత్వం రూ. 1.80 లక్షలు అందజేస్తోందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన కొలతల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలన్నారు. గృహ నిర్మాణశాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో నిర్మాణాలు ప్రారంభించేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ ఏఈ కె.మాధవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ సురేష్, మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మీసాల వెంకటరామకృష్ణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ డి.సుందరమ్మ, ఎంపీటీసీ సభ్యులు టి.శంకర్‌రావు, ఎందవ ప్రసాద్, మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి ఈవో నర్సింగరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

అంబావల్లిలో వైద్య శిబిరం

హిరమండలం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ప్రజలకు ఇంటి వద్దే వైద్యం అందుతోందని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సీహెచ్ సాయిగీత అన్నారు. అంబావల్లి గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు నిర్వహించారు.

జగనన్న విద్యాకానుక కిట్లు పరిశీలన

బూర్జ: బూర్జ జెడ్పీ హైస్కూల్లో భద్రపరిచిన జగనన్న విద్యాకానుక కిట్లను డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య శుక్రవారం పరిశీలించారు. మండలంలో 62 పాఠశాలలు, ఓవీపేటల ఏపీ మోడల్ స్కూల్, కొల్లివలసలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం, కేజీవీబీ సహా మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థుల కోసం సిద్ధం చేసిన కిట్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత మామిడివలస హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులు పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్.రామకృష్ణ, ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యాకానుక కిట్ల వివరాలు పరిశీలిస్తున్న డీఈవో తిరుమల చైతన్య

కోటేశ్వరాలయంలో పండిత సదస్యం



పండితులకు సత్కారం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని గుడివీధి ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాల్లో శుక్రవారం పండిత సదస్యం జరిగింది. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ఆరవెల్లి హరగోపాల్ శర్మ, చంద్రశేఖరశర్మ, వేమూరి ప్రభాకరశర్మ, రంగాభట్ల విశ్వనాథ శర్మ, ఆదిత్య శర్మ, తెన్నేటి వెంకన్నశర్మలను సత్కరించారు. కార్యక్రమంలో భక్తులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా యోగా కేంద్రం వార్షికోత్సవం



యోగా గురువు లడుగు లక్ష్మీ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక బాపూజీ కళామందిర్‌లో సూర్యపతంజలి యోగా కేంద్రం 6వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ప్రిన్సిపాల్ జిల్లా సెషన్స్ జడ్జి పప్పల జగన్నాథరావు యోగా వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగా కేంద్రం ద్వారా విద్యార్థులకు, సీనియర్ సిటిజెన్స్‌కు వేసవి శిక్షణా తరగతులు నిర్వహించినట్లు నిర్వాహకురాలు కొప్పూరి శ్రీదేవి తెలిపారు. ఆమదాలవలసకి చెందిన యోగా అసోసియేషన్ అధ్యక్షుడు, యోగా గురువు లగుడు లక్ష్మీ దంపతులను, మైథిలి సుప్రీతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం యోగా అసోసియేషన్ కార్యదర్శి బొడ్డేపల్లి దక్షిణామూర్తి, గీతా శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్‌కు కొత్త అధికారులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో చాలాకాలం తర్వాత అన్ని పోస్టులను భర్తీ చేశారు. ఈ మేరకు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత బదిలీలకు శుక్రవారం జీవో జారీ చేశారు. జీవీఎంసీలో ఏసీపీగా పనిచేస్తున్న ఐ.వి.రమణమూర్తిని శ్రీకాకుళం కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ-2గా, టీపీవోగా ఉమామహేశ్వరరావుని, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పి.ప్రమీలారాణిలను నియమించారు. అదేవిధంగా టీపీబీవోగా బి.జనార్ధన్ నియామకమయ్యారు. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో ముగ్గురు జేఈలను బదిలీ చేసి, వారి స్థానంలో ఇద్దరిని నియమించినట్లు కమిషనర్ చల్ల ఓబులేసు తెలిపారు.

పుస్తక పఠనంపై అవగాహన



శ్రీకాకుళం అర్బన్: మాట్లాడుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఈశ్వరరావు



లావేరు: మాట్లాడుతున్న రాంబాబు




ఎచ్చెర్ల క్యాంపస్: పుస్తక పఠనంలో విద్యార్థులు

లావేరు: పుస్తక పఠనంతో జ్ఞానం లభిస్తోందని రిసోర్సుపర్సన్ రాంబాబు అన్నారు. మురపాక గ్రామంలోని శాఖాగ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పుస్తక పఠనంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పుస్తకాలు, వాటి ప్రాధాన్యత గురించి వివరించారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు, సహాయకుడు షణ్ముఖరావు ఉన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు నిరంతరం పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సూచించారు.

శ్రీకాకుళం అర్బన్: చిన్నారుల భవిష్యత్‌కు బంగారు బాట వేసవి విజ్ఞాన శిబిరాలని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.ఈశ్వరరావు అన్నారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 26వ రోజైన శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు బయటకు వస్తాయన్నారు. అదేవిధంగా మంచి చురుగ్గా ఉంటారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, మ్యూజికల్ చైర్ వంటి గేమ్స్ ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎస్‌వీ రమణమూర్తి, ఉపాధ్యాయుడు పి.మురళీకృష్ణ, సిబ్బంది రామ్మోహన్, ప్రత్యూష, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి



మాట్లాడుతున్న ఈఈ రాజశేఖర్

నరసన్నపేట: ప్రతిఒక్కరూ ఇంధనాన్ని పొదుపు చేయాలని ఈపీడీసీఎల్ టెక్కలి డివిజన్ ఈఈ వీఏ రాజశేఖర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఇంధన పొదుపు/సామర్థ్యంపై విద్యుత్ వినియోగదారులతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులు విద్యుత్ వాడకంలో మెలకువలు పాటించడంతోపాటు వినియోగాన్ని తగ్గించాలన్నారు. ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. సమావేశంలో డీఈ కె.ఇంద్ర, ఏఈలు కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ పొదుపుపై వినియోగదారులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఎమ్మెల్యే కృష్ణదాస్‌ను కలిసిన నూతన ఎస్సై



ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్సై సత్యనారాయణ

పోలాకి: పోలాకి పోలీసుస్టేషన్ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను మబగాంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజా, సంఘవ్యతిరేక కార్యకలాపాలు చేపట్టేవారి నుంచి మండల ప్రజలను రక్షణ కల్పించాలని ఎస్సైకు సూచించారు. బాధ్యతాయుతంగా పనిచేసి సంఘంలో మంచిపేరు సంపాదించాలని ఆకాంక్షించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య మండలంలోని పలు సమస్యలను ఎస్సై దృష్టికి తీసుకువచ్చారు.